సీఎం బ్రేక్‌ఫాస్ట్‌కు బ్రేక్

- బిల్లులు చెల్లించని ప్రభుత్వం
- పథకాన్ని నిలిపివేసిన ఏజెన్సీ నిర్వాహకులు


ఇబ్రహీంపట్నం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం వండుతున్న నిర్వాహకురాలు

ఇబ్రహీంపట్నం: గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించింది. మొదటగా సజావుగా సాగినప్పటికీ ఈ ప్రభుత్వం రావడంతో 8 నెలలుగా బ్రేక్‌ఫాస్ట్‌కు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి, ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థుల కోసం సరుకులను తెచ్చి బ్రేక్‌ఫాస్ట్ పెట్టారు. బిల్లులు రాకపోవడం వలన బ్రేక్‌ఫాస్ట్‌ను నిర్వాహకులు బంద్ చేశారు. దీంతో విద్యార్థులు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేయకుండానే మధ్యాహ్న భోజనమే తింటున్నారు. మండలంలో 8 హైస్కూళ్లు, 14 ప్రాథమిక పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలో 25 ఏజెన్సీల ద్వారా విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు.

8 నెలలుగా రాని బిల్లులు

మండలంలోని పాఠశాలలకు ఫిబ్రవరి నుంచి అక్టోబర్ వరకు 8 నెలలుగా మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు రూ.8 లక్షల బిల్లు చెల్లించాల్సి ఉంది. కిరాణషాపులు, కూరగాయాల షాపుల్లో అప్పులు చేసి, విద్యార్థుల కోసం వంట చేసి పెడుతున్నామని, కాని ప్రభుత్వం బిల్లులు, జీతాలు సకాలంలో చెల్లించకపోవడంతో అప్పుల పాలవుతున్నామని, వెంటనే ప్రతి నెలా బిల్లులు, జీతాలు చెల్లించాలని ఏజెన్సీ నిర్వాహకులు కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న సీఎం బ్రేక్‌ఫాస్ట్ బిల్లులు వెంటనే చెల్లించి ఆదుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులు కోరుతున్నారు. మండలంలోని కొన్ని పాఠశాలల్లో సీఎం బ్రేక్ ఫాస్ట్ పెట్టకున్న ప్రతి రోజు కొన్ని పాఠశాలల్లో 150 నుంచి 200, 200 నుంచి 250 మందికి ప్రతి రోజు బ్రేక్‌ఫాస్ట్ పెడుతున్నట్లు ఎండీఎం యాప్‌లో ఉపాధ్యాయులు నమోదు చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఏజెన్సీ నిర్వాహకులకు తెలియకుండానే బ్రేక్‌ఫాస్ట్ పెడుతున్నట్లు నమోదు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉదయం టిఫిన్ పెట్టాలి



కొన్ని నెలలుగా పాఠశాలలో ఉదయం ప్రతి రోజు ఒక రకంగా టిఫిన్ పెట్టెవాళ్లు. కొన్ని నెలలుగా బంద్ చేయడంతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి ప్రతి రోజు పాఠశాలలో విద్యార్థులకు టిఫిన్ పెట్టెలా చర్యలు తీసుకోవాలి.

– వేణు, 10వ తరగతి విద్యార్థి, ఇబ్రహీంపట్నం

అప్పల పాలవుతున్నాం



నెలల తరబడి బిల్లులు, జీతాలు రాకపోవడంతో సరుకులు, కూరగాయలను అప్పులు చేసి, తీసుకొచ్చి వంట చేస్తున్నాం. బిల్లులు రాకపోవడంతో సకాలంలో రాక అప్పులు పాలవుతున్నాం. అప్పులు చెల్లించకపోతే దుకాణాలలో సరుకులు, కూరగాయలు ఇవ్వడం లేదు. ప్రభుత్వం ప్రతి నెల జీతాలు, బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.

– బైరీ రాజగంగు, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు

గైడ్‌లైన్స్ రాలేదు



సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం యథావిధిగా అమలు చేసేందుకు కొత్త ప్రభుత్వం ఎలాంటి గైడ్‌లైన్స్ ఇవ్వలేదు. బిల్లులు రాకపోవడంతో బ్రేక్‌ఫాస్ట్‌ను నిర్వాహకులు బంద్ చేశారు. వేతనాలు, బిల్లుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాం. మంజూరు కాగానే వేతనాలు, బిల్లులు చెల్లిస్తాం. బ్రేక్‌ఫాస్ట్ పెట్టకున్న, పెట్టినట్లు పాఠశాలల్లో యాప్‌లో నమోదు చేస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటాం.

– మధు, ఎంఈవో



జగిత్యాలటౌన్: కోనోకార్పస్ చెట్లు పర్యావరణానికి ప్రమాదమని, ఈ చెట్లు శ్వాసకోస వ్యాధులకు కారణమవుతాయని శాస్త్రవేత్తలు, పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదాన్ని గుర్తించిన పలు మున్సిపాలిటీలు గ్రామపంచాయతీల్లో ఇప్పటికే కోనోకార్పస్ చెట్లను తొలగిస్తూ వాటి స్థానంలో ఆరోగ్యకరమైన ఆక్సిజన్ అందించే చెట్లు పెంచుతున్నారు. జగిత్యాల బల్దియా అధికారులు మాత్రం ఇదేమీ పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అదికారులు స్పందించి కోనోకార్పస్ చెట్లు తొలగించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శంకర్,ఎంపీడీవో,కథలాపూర్ సెల్ నంబర్: 9281481652

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్: మండలంలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన గుగ్గిళ్ల రాకేశ్ యాదవ్ కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కును ఆదివారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి రాయికల్ లో అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపిరాజి రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కోడిపల్లి ఆంజనేయులు,జిల్లా యూత్ ప్రధానకార్యదర్శి కోయ్యాడి మహిపాల్‌రెడ్డి,మండల అధ్యక్షుడు ఏలేటి జలేందర్‌రెడ్డి,నాయకులు తలారి రాజేశ్, కాటిపల్లి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలి


పెగడపల్లి బైక్‌ర్యాలీలో కరుణాకర్‌రెడ్డి

పెగడపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వేముల కరుణాకర్ రెడ్డి అన్నారు. పెగడపల్లిలో ఆదివారం ఆయన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా సామాన్య రైతుబిడ్డనైన తాను బరిలో ఉంటానని, తనకు రైతు, విద్య, ఉద్యోగ, నిరుద్యోగ సమస్యలపై అవగాహన ఉందన్నారు. ఆయా రంగాల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకనవుతానని ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి శాసన మండలికి పంపించాలని ఆయన పట్టభద్రులను కోరారు.

మాజీ ఎమ్మెల్యే జ్యోతక్క సేవలు చిరస్మరణీయం


నివాళి అర్పిస్తున్న కాలనీవాసులు

మెట్‌పల్లి: మాజీ ఎమ్మెల్యే జ్యోతక్క నియోజకవర్గానికి అందించిన సేవలు చిరస్మర ణీయమని పలువురు పేర్కొన్నారు. పట్టణంలోని 23వార్డులో ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల హన్మాండ్లు, రైసుద్దీన్ ఆధ్వర్యంలో జ్యోతక్క సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏడాదిన్నర వ్యవధిలోనే రాములు, జ్యోతక్క దంపతులిద్దరూ మృతి చెందడం వారి అభిమానులను ఎంతో కలిచివేసిందన్నారు. ఎంపీపీగా, ఎమ్మెల్యేగా ఈ ప్రాంత అభివృద్ధికి జ్యోతక్క ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కొమొరెడ్డి కరం, విజయ్‌ఆజాద్, జెట్టి లింగం, గుంటుక విష్ణు, యామ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

11వ వార్డులో స్వచ్ఛ పారిశుధ్య కార్యక్రమాలు


చెత్త తీయిస్తున్న కమిషనర్, కౌన్సిలర్

రాయికల్: పట్టణంలోని 11వ వార్డులో ఆదివారం ప్రజా పాలన విజయోత్సవంలో భాగంగా స్వచ్ఛ పారిశుధ్యం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని మురికి కాలువలో చెత్తా చెదారాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మ్యాకల అనురాధ, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వార్డ్ ఇన్‌చార్జి ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు

కోరుట్ల టౌన్: పట్టణంలోని అయ్యప్ప దేవాలయ అభివృద్ధికి ఆదివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. తులసి కృష్ణ రూ.25,116,శ్రీరాముల శ్రీనివాస్ రమ రూ.21,116, నాగులపేట ఉప్పరపెల్లి నాగరాజు నవ్య రూ.21,116 విరాళాలు అందజేసినట్లు ఆలయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి మరింత మంది దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని అధ్యక్షుడు కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


సాగర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నల్లూరి సాగర్ ఇటీవల గెలుపొందగా, జగిత్యాలలో ఆదివారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలందరినీ కలుపుకుని కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్ రావు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బీరం రాజేశ్, మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, రాష్ట్ర కిసాన్ సెల్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, మల్లాపూర్ మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

మెట్‌పల్లి: మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ మైనార్టీ విభాగం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మహమ్మద్ సల్మాన్‌ఖాన్ అన్నారు. ఇటీవల ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను ఆదివారం పలువురు మైనార్టీ నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో మైనార్టీలకు సంబంధించిన ఎన్నో సమస్యలపై బీఆర్‌ఎస్ నిర్లక్ష్యం చూపిందన్నారు. వాటిని పరిష్కరించడానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో మైనార్టీలంతా కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రోత్సాహానికే సీఎం కప్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రవికుమార్

రాయికల్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తున్నామని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రవికుమార్ అన్నారు. ఆదివారం రాయికల్ మండలం అల్లిపూర్‌లో గ్రామస్థాయి క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను తమ ప్రతిభను వెలుగు తీసేందుకే సీఎం రేవంత్ రెడ్డి సీఎం కప్పును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతే కాకుండా ఈ క్రీడ ద్వారా యువకుల్లో ఆత్మస్థైర్యం స్నేహ సంబంధాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో పీడీలు కృష్ణ ప్రసాద్ ,కోటేశ్వరరావు, పీఈటీ రాజ్‌కుమార్, గ్రామ సెక్రటరీ శేఖర్, నాయకులు మోర వెంకటేశ్వర్లు, సతీశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ధర్మపురి: మండలంలోని జైనాలో ఆదివారం జగిత్యాలకు చెందిన భారతి పిల్లల హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు శ్రీనివాస్,నాగరత్న పలువురు రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో పిల్లల వైద్య శిబిరం

సారంగాపూర్: మండల కేంద్రంలో ఆదివారం పిల్లలకు జగిత్యాల పట్టణానికి చెందిన సాయిరాం న్యూరో పిల్లల ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సాయి ప్రణీత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో చిన్నారులకు వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో కొండ్ర రాంచంద్రారెడ్డి, చేకుట శేఖర్, మార్నేని పూర్ణచందర్, తుపాకుల జలేందర్, సోగాల విజయ్, రాసమల్ల మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా లక్ష్మణ్

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో గౌడ సంఘం అధ్యక్షుడిగా మరిపెల్లి లక్ష్మణ్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా కోటగిరి రాజేశ్ గౌడ్, కోశాధికారిగా అనుపురం కాజ రమేశ్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా నాయిని అంజయ్య, నేరెళ్ల గంగాధర్, జవ్వాజి చందు, మంత్రి మురళి, మరిపెల్లి శ్రీనివాస్‌గౌడ్, పల్లి గంగాధర్ ఆదివారం ఎన్నికయ్యారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు బంగారు పతకాలు


బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

జగిత్యాలటౌన్: లక్షెట్టిపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ టోర్నమెంట్‌లో జగిత్యాలకు చెందిన వీర కుంగ్‌ఫూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 6బంగారు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన వారిలో మనుప్‌కుమార్, బుర్ర కనిష్క్, మన్విత తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కుంగ్‌ఫూ అకాడమీ కోచ్ వెంకటేశ్వర్లు ఆదివారం అభినందించారు.

బంగారు పతకంసాధించిన విద్యార్థి

ఇబ్రహీంపట్నం : మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్‌లో ఆదివారం జరిగిన 4వ రాష్ట్రస్థాయి కుంగ్ ఫు కరాటే చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జగిత్యాల జిల్లా నుంచి 13 మంది విద్యార్థులు పాల్గొనగా, ఇబ్రహీంపట్నంకు చెందిన అలకుంట్ల మనోహర్ బంగారు పతకం సాధించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కరాటే శిక్షకుడు మాస్టర్ ప్రవీణ్‌కుమార్, కరాటే మాస్టర్లు నవీన్, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

రాయికల్ విద్యార్థులు ప్రతిభ

రాయికల్: పట్టణానికి చెందిన కనుక అభిరానంద యశోద, సాహిత్య, స్తంభం నిత్య, పెరుమల్ల విహారి అనే క్రీడాకారులు ఆదివారం లక్షెట్టిపేటలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలో బంగారు పతకాలు, పెరుమల్ల విశ్వశ్రీ వెండి పతకం సాధించినట్లు మాస్టర్ కానుక ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.


పతకాలతో విద్యార్థులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న హనుమంతరావు

ధర్మపురి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలనీ, పెండింగులో ఉన్న పీఆర్‌సీ డీ.ఏలను వెంటనే విడుదల చేయాలని డిసెంబరు 17న తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ధర్మ దీక్ష చేపట్టనున్నట్లు తపస్ రాష్ట్ర అధ్యక్షుడు కాసు గంటి హనుమంతరావు తెలిపారు.ఆదివారం ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావించారు. కార్యక్రమంలో తపస్ నాయకులు రొట్టె శ్రీనివాస్,బండి మహేష్,కాశెట్టి రమేష్,శీలం రాజేశ్, కాశెట్టి శ్రీనివాస్,కనపర్తి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై భయం వీడాలి


పాఠశాల సిబ్బందితో సైకాలజిస్ట్ గంప నాగేశ్వరరావు

రాయికల్: విద్యార్థులు భయం వీడి ఇష్టపడి చదివినప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధిస్తారని ప్రముఖ సైకాలజిస్ట్ గంప నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం రాయికల్ పట్టణంలోని ఓ పాఠశాలలో విజయతార అనే ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ ఉత్తమ కమ్యూనికేషన్ అవార్డు గ్రహీత గంప నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ,సెల్ ఫోన్‌కు టీవీకి,చాటింగ్ కు దూరంగా ఉండాలని,ఏ రోజు పనిని ఆ రోజు పూర్తి చేసుకునేలా ప్రత్యేక కార్యచరణ రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పిల్లలతో సమయం కేటాయించాలని ముఖ్యంగా చిన్నారులకు సెల్ ఫోన్ ఇవ్వొద్దని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ బాలె జయశ్రీ శేఖర్, అకడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో సన్న వడ్ల సాగు చేయాలి


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ గోవర్ధన్

మెట్‌పల్లి: యాసంగి సీజన్‌లో రైతులు సన్నరకపు వడ్లను సాగు చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ కోరారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల వరకు రుణాలను మాఫీ చేసిందన్నారు. సన్నరకాలను సాగు చేసే వారిని ప్రోత్సహించాలనే ఉధేశ్యంతో ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందని, దీనిని రైతాంగం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ముల చిన్నారెడ్డి, అందె మారుతి, ఖుత్బొద్దీన్, జాఫర్, కాటిపెల్లి మహేశ్, ప్రవీణ్, పవన్ తదితరులున్నారు.

ఘనంగా మల్లన్న స్వామి బోనాలు


ఆలయం వద్ద బోనాలతో భక్తులు

మల్లాపూర్: మండలంలోని రత్నాపూర్ శెట్టి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం గ్రామంలోని ఇంటికో బోనంతో పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు శ్రీ మల్లికార్జున స్వామికి సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడిపంటలు సమృద్ధిగా కలగాలని, గ్రామాల్లోని ప్రతి కుటుంబాన్ని సల్లంగా చూడాలని మల్లికార్జున స్వామిని కోరుకున్నామని తెలిపారు.

వైభవంగా అయ్యప్ప అష్టాదశ కలశ పూజ


అయ్యప్ప కలశపూజలో భక్తులు

కోరుట్లటౌన్: పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప అష్టాదశ కలశపూజ వైభవంగా ఆదివారం జరిగింది. అయ్యప్ప ఆలయ ఉపాధ్యక్షులు తులసి కృష్ణ స్వామి 18వ దీక్ష సందర్భంగా అయ్యప్పస్వామికి అష్టాదశ కలశ పూజ నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.